ప్రజాశక్తి
సోమవారం 24 ఫిబ్రవరి 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఓటర్ల నుంచి మంచి ఆదరణ

- తనపై వ్యక్తిగత దుష్ప్రచారం తగదు
- ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి
- పిడిఎఫ్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు, బాపట్ల

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ అభ్యర్థి ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. రెండు జిల్లాలో విస్తృత ప్రచారం చేశామని, ఓటర్ల నుండి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు ఛానల్ విస్తరణ, వరికెపూడిశెల, కృష్ణా జిల్లాలోని ఏకొండూరు కిడ్నీ బాధితుల సమస్యలు, కట్లేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వివిధ రంగాలలో ఉన్న పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడతానన్నారు. ముఖ్యంగా ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, 11వ వేతన సవరణలో న్యాయం జరగలేదని, 12వ వేతన సవరణ కమిషన్ ఇంత వరకూ నియమించలేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుండి రూ.22 వేల కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో దాదాపు 1.40 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, నవంబర్‌లోగా పూర్తి చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత లేదన్నారు. రెండు లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారని, 70 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారన్నారు. గతంలో ఆప్కాస్ వల్ల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కొద్దిపాటి భద్రతైనా ఉందని, ఇప్పుడు ఆప్కాస్‌ను రద్దు చేయాలనే ప్రభుత్వ ఆలోచనను మానుకోవాలన్నారు. 1.40 లక్షల మంది అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు ఇతర రంగాల స్కీమ్ వర్కర్లకు ఎప్పుడూ ▶ 2లో

నేటి నుంచి అసెంబ్లీ

- జిల్లా అవసరాలపై గంపెడు ఆశలు
- 'వెలిగొండ'కు వెంటనే రూ.2 వేల కోట్లు ఇవ్వాలనే డిమాండ్‌తో ఉద్యమం
- మార్కెట్‌లో రబీ పంటలకు పడిపోతున్న ధరలు
- పాలకపక్షం ప్రయత్నాలు ఏ మేరకు ఫలించేనో?
- ప్రతిపక్షం మొదటి రోజుకే పరిమితమా.?

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలకు ఏర్పాట్లు చేశారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. తొలిరోజున ప్రతిపక్ష సభ్యులు కూడా హాజరవుతున్నారు. వీళ్ల చివరివరకూ పాల్గొంటారా? లేదా? అనేదీ తేలనుంది. ఇక ప్రజా ఎజెండా విషయానికి వస్తే నిధులదే పెద్ద సవాలుగా మారింది. ఒక వైపు సూపర్‌సిక్స్ పథకాలు అటకెక్కాయి. అమలుకు నోచుకునే పరిస్థితి లేదు. నిధుల్లేవనే సాకుతో వాటిని వాయిదాలపై వాయిదాలు వేసుకుంటూ పోతున్నారు. అవసరాలు పెరుగుతున్నాయి. ఇచ్చిన హామీలకు నిధులు కావాలి. ఏం చేయాలన్నది ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేతిలోనే ఉంది. ఇప్పటి వరకూ అంటే 8 నెలలు మాటలు చెబుతూనే వచ్చారు. ఆర్థిక పరిస్థితి బాగాలేదంటూ కొద్దిరోజులు.. జగన్‌పై దుమ్మెత్తి పోస్తూ మరికొన్ని రోజులు.. శ్వేతపత్రాలు పేరుతో కొంత కాలం గడిపారు. మరో నాలుగు నెలలు పోతే ఏడాది గడిచినట్లే.. ఇదే తీరున పాలన సాగుతుందా? ఇచ్చిన హామీలు అమలు చేస్తారా? అన్నదీ చూడాలి. జిల్లాలో ప్రధానంగా చూస్తే ఇప్పుడు వెలిగొండ ఎజెండా కీలకంగా ఉంది. దీనికి నిధుల కేటాయింపే ప్రభుత్వానికి సంకటంగా మారింది. చంద్రబాబుకు వెలిగొండపై శ్రద్ధ లేదనే విమర్శను నిజం చేసేలా ఆయన తీరు ఉందనే చర్చ సాగుతోంది. ఎందుకంటే ఇప్పటికీ నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వలేదు. గిద్దలూరు, మార్కాపురం, వైపాలెం సభల్లో వెలిగొండపైనా, నిర్వాసితులకు ఇవ్వని హామీ అంటూ లేదు. అధికారంలోకి రాగానే అన్నీ చేస్తామన్నారు. ఇప్పటికీ ప్యాకేజీలకు నిధులు ఇవ్వలేదు. పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటివరకూ వేచిచూసిన ప్రతిపక్ష పార్టీలు దీనిపై ఆందోళన చేపట్టాయి. వెలిగొండకు వెంటనే రూ.2 వేల కోట్లు ఇవ్వాలంటూ సిపిఎం, సిపిఐ, రైతుసంఘం ఆందోళనలు చేపట్టాయి. సదస్సులు, రాయబారాలు, ధర్నాలు వంటి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. దీనిపై జిల్లా మంత్రులకు ఏదో చేయాలనే తపన ఉన్నా సిఎం చంద్రబాబు స్థాయిలోనే దీనిపై దృష్టి సారించాల్సి ఉంది. ఆయన దీనిపై ఇంకా దృష్టి పెట్టలేదు. ఇక వెనుకబాటు జిల్లాగా గుర్తించినా నిధులు కేటాయింపులు ప్రత్యేకంగా ఏమీ రావడం లేదు. కేంద్రంపై ఒత్తిడి చేయాల్సి ఉంది. అనేక శాఖల్లో చేసిన పనులకు నిధుల్లేవు. బిల్లుల చెల్లింపులు లేవు. ఏ పనులు చేపట్టాలన్నా నిధుల్లేవనే చర్చ బాహాటకంగా సాగుతోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు కాలేదు. మార్కాపురం జిల్లా, కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలు ప్రకాశంలో విలీనం వంటివీ అతీగతీ లేవు. వీటిపైనా పాలకపక్ష నేతలు నీళ్లు నములుతున్నారు. నియోజకవర్గాల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ ఆచరణలోకి రాలేదు. ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు ఇచ్చే పథకం ఆగిపోయింది. కొత్తగా చేపట్టే పథకాలకు రూ.5 వేల కోట్లు కావాలని అంచనా వేశారు. పైగా వెలిగొండ కూడా పూర్తయితేనే అక్కడ నుంచే పశ్చిమాన నియోజకవర్గాలకు తాగునీరు, సాగునీరు ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పుడు ▶ 2లో

ప్రశాంతంగా 'గ్రూప్-2' పరీక్షలు

- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ అన్సారియా
- పరీక్షలకు 3968 అభ్యర్థులు హాజరు
- భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన ఎస్‌పి దామోదర్

పరీక్షా కేంద్రాలలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షల కోసం ఒంగోలు నగరం, శివారులోని ఐదు ప్రాంతాలలో ఏడు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పటిష్ట భద్రత మధ్య క్షుణ్ణంగా తనిఖీ చేశాక అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. క్విస్ ఇంజినీరింగ్ కళాశాల, రైజ్ ఇంజినీరింగ్ కళాశాల, పేస్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాలను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తనిఖీ చేశారు. ఒంగోలు నగరంలోని శ్రీ నాగార్జున డిగ్రీ కళాశాల, శ్రీ హర్షిణి డిగ్రీ, పీజీ కళాశాల, క్విస్ ఇంజినీరింగ్ కళాశాల, రైజ్ ఇంజినీరింగ్ కళాశాల, పేస్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాలను సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తనిఖీ చేశారు. అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా ఈ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 4544 మంది అభ్యర్థులకుగాను ఉదయం 3968 మంది (87.32 శాతం), మధ్యాహ్నం 3965 మంది (87.25 శాతం) మంది పరీక్షలకు హాజరయ్యారు. తనిఖీ కార్యక్రమాల్లో ఏఎస్పీ నాగేశ్వర రావు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఏడీ అర్చన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన ఎస్‌పి

పరీక్షా కేంద్రాల వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్, జేసీ గోపాలకృష్ణ

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ స్వయంగా పరిశీలించారు. శ్రీ నాగార్జున డిగ్రీ కళాశాల, క్విస్ ఇంజినీరింగ్ కళాశాల కాలేజ్, రైజ్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రాలను ఎస్‌పి సందర్శించి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. పరీక్ష రాసేందుకు వచ్చిన ప్రతి ఒక్క అభ్యర్థిని పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతించాలని సిబ్బందికి సూచించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ▶ 2లో

నేడు చెంచయ్య, కోటయ్యల వర్ధంతి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

చెంచయ్య, కోటయ్య (ఫైల్)

ప్రజా ఉద్యమ నేతలు, సిపిఎం జిల్లా పూర్వ కార్యదర్శులు తవనం చెంచయ్య, పమిడి కోటయ్యల వర్ధంతి కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు ఒంగోలు, సుందరయ్య భవన్లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. మాబు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే నివాళి కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సభ్యులు, సానుభూతిపరులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

సిబ్బందితో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కో ఆర్డినేటర్ పద్మజ

గురుకుల పాఠశాలలో పరిశీలన

4లో ▶

నేటి నుంచి అసెంబ్లీ..

(మొదటిపేజీ తరువాయి)

వేసవిలో మళ్లీ తాగునీటి కోసం రోడ్లెక్కడం ఖాయం. ఇప్పటికే గ్రామాల్లో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. ఒంగోలు-బేస్తవారిపేట రహదారి విస్తరణ పనులు సందిగ్ధంగానే ఉన్నాయి. పల్లె పండుగకు మంజూరు చేసిన పనులకు నిధుల్లేవు. బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. పరిశ్రమలు రాలేదు. విమానాశ్రయం రావాలంటే వాన్‌పిక్ నుంచి భూమిని సేకరించాలి. ఇదెప్పుడు జరుగుతుందో చూడాలి. ఇక ఇతర సమస్యలూ తీవ్రమవుతున్నాయి. పంట చేతికందే దశలో ధరలు పడిపోతున్నాయి. మిర్చి ధర చూస్తున్నాం. శనగలదీ ఇదే పరిస్థితి. పొగాకు వేలం ప్రారంభం కాబోతోంది. దిగుమతుల దెబ్బతో ఇక్కడ రైతులకు నష్టం జరుగుతోంది. పాలకపక్షం ఏ మేరకు ప్రయత్నాల్లో సఫలీకృతమవుతుందో చూడాలి. బడ్జెట్‌లో కేటాయింపులు దండిగా ఉండేలా చూసుకుంటారా? లేదా? అన్నదీ తేలనుంది. ఇక ప్రతిపక్షం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలున్నారు. వీళ్లు ఏ మేరకు ఏపీ అంశాలపై పోరాడతారో చూడాలి.

ఓటర్ల నుంచి మంచి ఆదరణ

(మొదటిపేజీ తరువాయి)

అండగా ఉంటామన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. గ్రూప్-2 మెయిన్స్ నిర్వహణపై విలేకరుల అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ప్రభుత్వం చర్చలు జరుపుతున్నామని ముందు రోజు చెబుతూ వచ్చిందని, కానీ పరీక్ష నిర్వహించారన్నారు. రోస్టర్ అమలు చేయకుండా పరీక్ష నిర్వహించటం సరికాదన్నారు. జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ గత నెలల పాలనలో ప్రధాన హామీలు ఏవీ నెరవేర్చలేదన్నారు. ఉద్యోగాల కల్పన గానీ, ప్రాజెక్టులకు నిధులు లేవన్నారు. నిరంతరం ప్రజల కోసం పనిచేసే లక్ష్మణరావును గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ బంజారా హిల్స్‌లో కోట్ల విలువైన ఇంటి స్థలాలను తిరస్కరించి, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరిన ఘనత పిడిఎఫ్‌కు ఉందన్నారు. 18 ఏళ్లలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజల కోసమే పనిచేశామని చెప్పారు. విద్య, వైద్యం పెద్దఎత్తున ప్రైవేటుపరం అవుతున్న నేపథ్యంలో వాటి పరిరక్షణకు పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం.హనుమంతరావు, జెవివి నాయకుటు టి.జాన్‌బాబు, రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ నాయకులు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత దుష్ప్రచారం తగదు..

గత మూడు, నాలుగు రోజులుగా ప్రత్యర్థి నుంచి తనపై వ్యక్తిగత దుష్ప్రచారం తగదని లక్ష్మణరావు అన్నారు. ఆ విధంగా తాము కూడా చేయదలుచుకుంటే చాలా ఉన్నాయన్నారు. అటువంటి విధానం తమది కాదన్నారు. ధైర్యం ఉంటే విధానాల ప్రాతిపదికన పోరాడాలన్నారు. మీరు ప్రజలకు ఏం చేశారో మీరు చెప్పండి... మేం ఏం చేశామో చెబుతామని ఘాటుగా స్పందించారు. అలా కాకుండా వ్యక్తిగతంగా కించపరిచే చర్యలు మానుకోవాని హితవు పలికారు. ఇటువంటి తప్పుడు విమర్శలను విజ్ఞులైన ఓటర్లు గమనిస్తూనే ఉన్నారన్నారు. గత సిఎం జగన్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు హెలీప్యాడ్ వద్ద వివిధ రకాల సమస్యలపై వేర్వేరు వినతిపత్రాలు ఇచ్చే క్రమంలో కింద జారిపడిన కాగితాన్ని తీసుకుంటుంటే సిఎంకు కాళ్లు మొక్కినట్లు ప్రత్యర్థులు చిత్రీకరించటం శోచనీయం అన్నారు. ఏ ప్రభుత్వానికి కాళ్లు మొక్కే సంస్కృతి తమకు లేదని అన్నారు.

రైతులు ఫార్మర్ ఐడిలు పొందాలి

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని అన్ని గ్రామాలలోని రైతులకు రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఫార్మర్ ఐడీలు నమోదు చేస్తున్నారని మండల వ్యవసాయ శాఖాధికారి లావణ్య తెలిపారు. ఫార్మర్ ఐడి లేనివారు ప్రభుత్వం అందజేస్తున్న ప్రభుత్వ పథకాలకు అర్హత కోల్పోతారని ఆమె తెలిపారు. రైతులు తమ పొలం పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్‌తో రైతు సేవ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

340 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పర్చూరు

రోటరీ క్లబ్ స్థాపించి 120 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. స్థానిక రోటరీ భవన్లో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దేవరపల్లి గ్రామానికి చెందిన తోకల తరుణ్, పర్చూరుకు చెందిన కోటా శ్రీనివాసరావు, ప్రసన్న దంపతుల ఆర్థిక సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 340 మంది రోగులకు కాటూరి మెడికల్ కాలేజి అండ్ హాస్పిటల్ వైద్యులు ఉచిత సేవలు అందించారు. గుండె, ఊపిరితిత్తులు, గొంతు, చెవి, ముక్కు, కళ్లు, చర్మ వ్యాధులకు సంబంధివంచిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు ఎక్కువ ఖర్చుతో కూడిన వైద్య పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించడం విశేషం. కొంతమంది దీర్ఘకాలిక రోగులకు స్వయంగా కాటూరి ఆసుపత్రికి రమ్మని సూచించారు. అలాంటి వారి కోసం ఫిబ్రవరి 24వ తేది, సోమవారం ఉదయం 8 గంటలకు పర్చూరు రోటరీ భవనం వద్ద ఉచిత బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్, కార్యదర్శి కె ఆంజనేయులు, సభ్యులు నాగభైరు శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రం, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, రావి సత్యనారాయణ, తేళ్ల రమేష్‌చంద్ర, డి శేషుబాబు, పంబి సదానందరెడ్డి, రావి సతీష్‌బాబు, వైద్యులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ వంశీ, డాక్టర్ గౌతమ్, డాక్టర్ పార్వతి, డాక్టర్ మాధురి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జమీల తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ముమ్మరంగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలో ఆదివారం పలు గ్రామ పంచాయతీల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ఆదేశాల మేరకు ఇఓఆర్‌డి ఎం రమణమ్మ పర్యవేక్షణలో నిర్వహించారు. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది ఇంటింటా పర్యటించి తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా తీసుకొని ట్రాక్టర్లలోకి చేరవేశారు. సంతనూతలపాడు మేజర్ పంచాయతీలో పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ఎన్ ప్రతాప్‌కుమార్ పర్యవేక్షణలో జూనియర్ అసిస్టెంట్ శిఖామణి, సచివాలయ సిబ్బంది ముమ్మరంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తడి చెత్త, పొడి చెత్తకు సంబంధించి కరపత్రాలను గ్రామపంచాయతీ సిబ్బంది ప్రజలకు పంపిణీ చేశారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ పట్ల ప్రజలకు తగు సూచనలు ఇచ్చారు. సంతనూతలపాడు అంబేద్కర్ నగర్‌లో ముమ్మరంగా ఈ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇఓఆర్‌డి ఎం రమణమ్మ దీనిని పర్యవేక్షించారు. మండలంలోని వేములపాడు, సంతనూతలపాడు, గుడిపాడు, మద్దులూరు, గుమ్మళంపాడు, చిలకపాడు తదితర గ్రామాల్లో ఆయా కార్యదర్శుల పర్యవేక్షణలో ఈ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

చంద్రబాబుపై జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

ప్రజాశక్తి-వేమూరు

బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చంద్రబాబు నాయుడును 9 ఏళ్ల పాటు తెలంగాణ నుంచి తరిమేశామని బిఆర్ఎస్ మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి సోమరౌతు అనురాధ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ కృష్ణా జలాల విషయంలో తెలంగాణ రాష్ట్రంలోని రెండు పార్టీలు అటు చంద్రబాబుకు, ఇటు మోడీకి తలొగ్గి వ్యవహరిస్తున్నాయని చెప్పటాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. నేడు తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తోంది అంటే అది చంద్రబాబు చలవేనని, ఆ విషయాన్ని బిఆర్ఎస్ నాయకులు గుర్తెరగాలని హితవు పలికారు.

చంద్రబాబు నాయుడు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధిక భాగం హైదరాబాదు అభివృద్ధికే అహర్నిశలు కృషి చేశారని, ఆయన చేసిన కృషి వల్లే నేడు హైదరాబాదు దేశంలో ఉన్న ప్రధాన నగరాలలో ఒకటిగా నేడు వెలుగొందుతోందన్నారు. అలాంటి చంద్రబాబు నాయుడును జగదీష్‌రెడ్డి విజ్ఞత లేకుండా మాట్లాడటం సరికాదన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

25న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరుడొంక వద్దగల మహిళా ప్రాంగణంలో ఈ నెల 25వ తేదీ మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జె రవితేజ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. 19 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల మధ్యగల ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు దీనిని వినియోగించుకోవాలని కోరారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

ఎటువంటి విమర్శలకు తావులేకుండా సమర్ధవంతంగా నిర్వహించడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలోని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాల వెలుపల 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఈ పరీక్షలు ముగిశాక ఆ పత్రాలు పటిష్ట భద్రతా నడుమ స్ట్రాంగ్ రూంలకు తరలించామన్నారు. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్‌లో పోలీస్ హెల్ప్ డెస్కలను కూడా ఏర్పాటు చేశామన్నారు. పత్యేక పోలీస్ వాహనాలను రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేసి వారిని పరీక్షా కేంద్రాలకు తరలించామన్నారు. డ్రోన్ ద్వారా కూడా భద్రతను పర్యవేక్షించామన్నారు. కార్యక్రమంలో ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కెవి రాఘవేంద్ర, ఒంగోలు తాలూకా సిఐ అజయ్ బాబు, ఒంగోలు రూరల్ సిఐ యన్. శ్రీకాంత్‌బాబు, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సింగరాయకొండ సిఐ హాజరత్తయ్య, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఇంటి ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

బాపట్ల జిల్లా మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామం లో నివాసం ఉండే పర్చూరు ఆదినారాయణ తండ్రి వెంకటస్వామి కి చెందిన గౌడ బజార్ లోని కర్పూరపు అంకమ్మ తల్లి దేవాలయం సమీపంలోని చ.గ. 105లో ఉన్న ఆర్.సి.సి డాబా ఇం.నం. 2-23కి సంబంధించిన
డాక్యుమెంట్ నెంబర్‌లు
(1) 298/1994,
(2) 373/1994

గల ఇంటి ఒరిజినల్ దస్తావేజులు జిరాక్స్ తీయు నిమిత్తం ద్రోణాదుల నుండి మార్టూరు సెంటర్ కి ఆటోలో వెళుతుండగా పోయినవి. దొరికినవారు క్రింది చిరునామాకు తెలుపగలరు.

పర్చూరు ఆదినారాయణ
తండ్రి వెంకటస్వామి
గౌడ బజార్
ద్రోణాదుల గ్రామం
మార్టూరు మండలం
బాపట్ల జిల్లా
సెల్ : **9014087432**

నోటీసు
మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P.No. 56/2023

ఆరేపాటి వెంకటేశ్వర్లు .... పిటీషనరు
వర్సెస్
పొత్తంశెట్టి వేంకటేశ్వర్లు మరియు 7 మంది వగైరాలు .... రెస్పాండెంట్లు

టు,
ఆర్-4): గుంటక సాయి మురళీధరరెడ్డి, తండ్రి: వెంకటేశ్వరరెడ్డి, వయసు: 50 సం॥, హిందూ, నివాసం: మార్కాపురం టౌన్ మరియు మండలం, ప్రకాశం జిల్లా.
ఆర్-8): ఆరేపాటి మల్లేశ్వరి, భర్త: రామకృష్ణ, వయసు: 50 సం॥, హిందూ, నివాసం: మార్కాపురం టౌన్ మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఐ.పి.లోని, పిటీషనరు ఐ.పి. లోని 'ఎ' షెడ్యూలు బాకీలను రెస్పాండెంట్లకు పిటీషనరు తీర్చలేక పోయినందున పిటీషనరును ఇన్సాల్వెంటుగా డిక్లేర్ చేయమని, పిటీషనరు పై కోర్టులో, పైనెంబరున Debtor Insolvency Petition దాఖలు చేసియున్నాడు. ఇందు విషయమై మీకు పలుమార్లు నోటీసులు పంపగా, అవి మీకు ముట్టని కారణము చేత ఈ దినపత్రిక నోటీసు ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా 18-03-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో మీరు స్వయముగా లేదా మీఅడ్వకేట్ ద్వారా గానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమందు ఐ.పి.ని విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 18-03-2025
మార్కాపురం
కె.అచ్చిరెడ్డి,
పిటీషనరు తరపు అడ్వకేట్.
సెల్: 9440924920

దావా సమను
(C.P.C. Order 5 Rule 1 & 5)
మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S No. 331/2023

Syndicate Bank now merged in CANARA BANK, Kaluzuvvalapadu Branch,
Rep. by its Branch Manager …. Plaintiff
Vs
SRI LAKSHMI YOUTH FASHIONS
Prop. Of Vanukuri Ravindra Reddy and others …. Defendants

To
D1) :- SRI LAKSHMI YOUTH FASHIONS Prop. Of Vanukuri Ravindra Reddy, S/o.Chinna Kasi Reddy, aged about 37 years, Hindu, Business, Resident of D.No.4-241, Rajaji Street, Markapur Town and Mandal, Prakasam District.
D2) :- Shaik Abdul Kalam, S/o.Usman, aged about 40 years, Muslim, Private Employee, Resident of Mahammad Nagar, D.No.1-203-E-42, behind Power Office, Markapur Town and Mandal, Prakasam District.

పై నెంబరు దావాలోని, వాది/బ్యాంకు దావా పరిహారం నిమిత్తం, అనగా 1వ ప్రతివాది వాది/బ్యాంకు నందు తీసుకున్న వ్యాపార రుణం తీర్చనందున, సదరు 1వ ప్రతివాది వ్యాపారం రుణంనకు మీరు హామీదారుడిగా ఉండి వాది/బ్యాంకు పేర మీరు అగ్రిమెంట్ వ్రాయించి ఉన్నందున, పై కోర్టులో, పై నెంబరున వాది/బ్యాంకు మీ పైన దావా దాఖలు చేసియున్నారు. ఇందు విషయమై మీకు పలుమార్లు దావా సమన్లు పంపగా, అవి మీకు ముట్టని కారణము చేత ఈ దినపత్రిక దావా సమను ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా 11-03- 2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో మీరు స్వయముగా లేదా అడ్వకేట్ గారి ద్వారా హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమందు దావాను విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 11-03-2025
మార్కాపురం
కె.అచ్చిరెడ్డి
వాది తరపు అడ్వకేట్
సెల్: 9440924920.

ప్రజాశక్తి 3
సోమవారం 24 ఫిబ్రవరి 2025

బ్యాంకుల్లో జమ కాని 'డ్వాక్రా' నగదు

సొంతానికి వాడుకుంటున్న విఒఎలు

'వెలుగు' అధికారుల నిర్లక్ష్యంపై మహిళల ఆగ్రహం

ప్రజాశక్తి-శింగరాయకొండ

వెలుగు కార్యాలయాల్లో వీఓఏల మోసాలకు పేదలు బలవుతున్నారు. నిత్యం కాయ కష్టం చేసుకుని రూపాయి రూపాయి దాచిపెట్టుకొని డ్వాక్రా మహిళల ద్వారా పొదుపులో దాచిపెట్టుకున్న సొమ్ము దోచేస్తున్నారు. నగదు బ్యాంకులకు జమ చేయకుండా సొంతానికి వాడుకుంటున్న వీవోఏల లీలలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. మొన్న శింగరాయకొండ మండలం బింగినపల్లి గ్రామంలో డ్వాక్రా గ్రూపుల వద్ద నెల వసూలు చేసిన డబ్బులు బ్యాంకులో జమ చేయకుండా రూ.25 లక్షలు దోచుకున్నారు. నిన్న జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట గ్రామంలో ఇదే తరహాలో రూ.20 లక్షలకు పైగా మోసం చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. డ్వాక్రా సంఘాలకు వెలుగు కార్యాలయం సిబ్బందికి బ్యాంకర్లకు ప్రతి నెల సమావేశాలు జరుగుతుంటాయి. అయితే ఒక్క నెల కట్టకపోతేనే బ్యాంకర్లు గగ్గోలు పెడుతున్న ఈ రోజుల్లో సంవత్సరం పాటు బ్యాంకర్లకు డబ్బులు కట్టకపోతే బ్యాంకర్ల నిర్లక్ష్యమా..? వెలుగు కార్యాలయం అధికారుల నిర్లక్ష్యమా..? అనేది ఇక్కడ చర్చగా మారింది.

పట్టించుకోని అధికారులు

అయితే వెలుగు కార్యాలయంలో ప్రతినెలా నిర్వహిస్తున్న సమీక్షలు ఎందుకు నిర్వహిస్తున్నారనేది అర్థం కాని ప్రశ్నగా మారుతోంది. వెలుగు కార్యాలయం సిబ్బంది గ్రామాలకు వెళ్లి సమావేశాలు పెట్టినట్లు ఫోటోలు తీసుకుని వస్తున్నారు తప్ప ఆ సమావేశాలలో వెలుగు కార్యాలయం నియమ నిబంధనలను గాలికి వదిలేయడంతో ఈ పరిస్థితి రావటం జరిగిందని మహిళలు చెబుతున్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా వసూలు చేసుకుని ఆ డబ్బులు బ్యాంకులో జమ చేయకుండా ఉంటే కార్యాలయంలో ఏం జరుగుతుందనేది తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బింగినపల్లి డ్వాక్రా మహిళలు వెలుగు కార్యాలయానికి వచ్చి మా డబ్బులు జమ కాలేదని మాకు న్యాయం చేయాలని బోరున విలపించడం అందరినీ కలిసివేసింది. జరుగుమల్లి మండలం కే బిట్రగుంట గ్రామంలో కూడా ఇదే పరిస్థితి జరిగింది. అక్కడ డ్వాక్రా మహిళలు బ్యాంకులో జమ చేసిన డబ్బులు విషయంలో వివో ఏ తన సొంత ఖాతాలోకి గమ్మునేసుకోవడంతో దాదాపు 20 లక్షల రూపాయలు పైగా గోల్మాల్ జరిగిందని తమకు న్యాయం చేయాలని. మహిళలు కార్యాలయానికి వెళ్లి వేడుకున్నప్పటికీ అధికారుల్లో చలనం లేకపోవడం విశేషం.

వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బింగినపల్లి డ్వాక్రా మహిళలు

ఏపీఎంను నిలదీస్తున్న కె.బిట్రగుంట డ్వాక్రా మహిళలు

డబ్బులు అడిగితే ఆత్మహత్య చేసుకుంటా..

బింగినపల్లి గ్రామానికి చెందిన విఓఏ తనను ఇంటికి వచ్చి డబ్బులు అడిగితే ఆత్మహత్య చేసుకొంటానని డ్వాక్రా మహిళలను బెదిరింపులకు దిగుతోంది. డ్వాక్రా మహిళలు ఆ బెదిరింపులు దెబ్బకు భయపడి వెలుగు కార్యాలయానికి వస్తే అక్కడ ఉన్న సిబ్బంది కూడా మేము అడిగిన మా పేర్లు రాసి చచ్చిపోతామని చెబుతుందని.. ఒకరి గోడు ఒకరికి చెప్పుకోవటం ఇక్కడ జరుగుతుంది. బింగినపల్లి గ్రామానికి చెందిన డ్వాక్రా గ్రూపుల్లో రూ.25 లక్షలు కాకుండా ఇంకా పెరుగుతాయని పూర్తిస్థాయి విచారణ జరపాలని ఆ గ్రామ మహిళలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసింది చాలు కూల్ డ్రింక్స్ తాగిపోండి...

కె.బిట్రగుంటకు చెందిన విఓఏ డబ్బులు వాడుకున్నదే కాకుండా కార్యాలయంకు వెళ్లి ఫిర్యాదు చేసిన డ్వాక్రా మహిళలకు ఇచ్చిన సమాధానంతో ఆ మహిళలు ఆశ్చర్యపోయారు. ఆఫీసుకు వెళ్లి నా మీద ఫిర్యాదు చేసింది ఇక చాలులే అలసిపోయి ఉన్నట్లు ఉన్నారు. వెళ్లి కూల్ డ్రింక్ తాగండి లేకపోతే నేను కూల్ డ్రింక్స్‌తో పాటు బిర్యానీ కూడా తీసుకొచ్చి మీకు పెడతానని చెప్పడం విశేషం. సమగ్రమైన విచారణ జరిపితే ఇంకా చాలా బయటకు వస్తాయని మహిళలు చెబుతున్నారు.

గ్రామాల్లో డ్వాక్రా డబ్బులు మింగేస్తున్న వారిపై నిఘా ఏమయింది అనేది అర్థం కావటం లేదు. బ్యాంకుల్లో రుణాలు ఇప్పించడంతోపాటు ఆ బ్యాంకులకి డబ్బులు కట్టించాల్సిన బాధ్యత కూడా ఈ కార్యాలయం సిబ్బందిపైనే ఉంది. సంవత్సరాలు కొద్ది డబ్బులు జమ చేయకపోతే బ్యాంకు అధికారులు ఏం చేస్తున్నారు? వెలుగు కార్యాలయంలో జరుగుతున్న ఈ వ్యవహారాలపై ఉన్నతాధికారుల విచారణలో ఇంకా ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వస్తాయనేది తెలుస్తోంది.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అక్రమ మద్యం బాటిళ్లు కలిగి ఉన్న ఒక వ్యక్తిని అరెస్టు చేయడంతో పాటు 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు యర్రగొండపాలెం ఎక్సైజ్ సిఐ సిహెచ్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ యర్రగొండపాలెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయ పరిధిలోని త్రిపురాంతకం మండలం మేడపి గ్రామంలో తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో మేడపి గ్రామానికి చెందిన ఎం.రవణయ్య నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బ్యాంకు మేనేజర్ విక్రమ్ తేజను సన్మానిస్తున్న దృశ్యం

తోపుడు బండ్లు అందజేత

ప్రజాశక్తి-శింగరాయకొండ

పేద ప్రజలకు అండగా ఉండటమే మానవత స్వచ్ఛంద సంస్థ లక్ష్యమని సభ్యులు తెలిపారు. ఆదివారం మానవతా కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించి డాక్టర్ మలినేని లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ నుంచి కూరగాయలు పండ్లు అమ్ముకునే నిరుపేదలకు తోపుడుబండ్లను పంపిణీ చేశారు. అనంతరం శింగరాయకొండ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ విక్రమ్ తేజ బ్యాంకు రుణాలు విషయంలో అందరికీ సహకరించడంతోపాటు అక్కడికి వెళ్లిన సీనియర్ సిటిజన్స్‌కు ఇస్తున్న విలువలను గమనించి మానవత సభ్యులు బ్యాంక్ మేనేజర్ విక్రమ్ తేజను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంవి రత్నం కోటపాటి నారాయణ, ఎం.నరసింహారావు, రామలక్ష్మమ్మ, గుంజి రమణయ్య, ఉపాధ్యాయులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రోల్ లేదు.. తాళం కనపడటం లేదు..!

టంగుటూరు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అసౌకర్యం

అందుబాటులో లేని బుకింగ్ ఆపరేటర్

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు రైల్వే స్టేషన్‌లో టికెట్లు అందక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. టిక్కెట్ బుక్కింగ్ కౌంటర్‌లో బుకింగ్ ఆపరేటర్ అందుబాటులో లేకపోవడంతో స్టేషన్ మాస్టర్‌ను టికెట్లు అడిగితే రోల్ లేదు.. తాళం కనపడటం లేదని సమాధానం ఇచ్చారు. దీంతో రైలు ఎక్కడానికి వచ్చిన ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ట్రైన్‌లో ఎక్కి టీటీ లేదా టీసీ వద్ద టిక్కెట్ రాపించే ఏర్పాటు అయినా చెయ్యండి అంటే దానికి సరైన జవాబు ఇవ్వలేదు. ఈ విషయమై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి, సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజనల్ మేనేజర్‌కి ఫిర్యాదు చేశారు. టంగుటూరు నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇటువంటి అసౌకర్య ఘటనలు ఎదురు కాకుండా ఉండేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కొండపి

కొండపి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల్లో రానున్న విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ అరుణ ఆదివారం తెలిపారు. మార్చి నెల 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఏప్రిల్ 6న ఆదివారం ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9505658235 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి మున్సిపాలిటీ బడ్జెట్ ప్రత్యేక సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురం రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ కౌన్సిల్ సమావేశానికి వైస్ చైర్మన్లు మరియు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

కంభంలో ఎనీటైం మద్యం

యథేచ్ఛగా సిట్టింగ్ రూములు

సీసాపై రూ.50 అదనంగా వసూలు

ప్రజాశక్తి-కంభం

కంభంలో సమయం అనేది లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు చేపడుతున్నారు. 24 గంటలూ మద్యం అమ్మడమే కాకుండా అక్కడే సిట్టింగ్ రూములు కూడా ఏర్పాటు చేశారు. దీనికి తోడు ప్రతి క్వార్టర్ సీసాపై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారు. వీటిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై కంభం ఎక్సైజ్ సీఐ వివరణ కోరగా ప్రభుత్వం ఎవరికీ సిట్టింగ్ రూములకు పర్మిషన్ ఇవ్వలేదన్నారు. సిట్టింగ్ రూములు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా పక్క రాష్ట్రాల మద్యం అమ్మకాలు ఎవరైనా జరిపితే మాకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు.

వ్యాపారులు ఏర్పాటు చేసిన సిట్టింగ్ రూము

పండ్ల తోటలకు తప్పిన ముప్పు

నిప్పు పెట్టిన ఆకతాయిలు

సకాలంలో స్పందించిన అగ్ని మాపక సిబ్బంది

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం సమీపంలోని పుల్లలచెరువు రోడ్డులో సాగులో ఉన్న బత్తాయి, నిమ్మ, మిరప తోటలు ఆకతాయిలు పెట్టిన నిప్పుతో కాలిపోకుండా సకాలంలో అగ్ని మాపక సిబ్బంది స్పందించడంతో ముప్పు తప్పింది. లేకుంటే సాగులో ఉన్న తోటలన్నీ కాలపోయి రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పుల్లలచెరువు రోడ్డులో ఎక్కువగా మిరప తోటలు, నిమ్మ, బత్తాయి తోటలు సాగులో ఉన్నాయి. రైతులు ఆ తోటలను ఆరుగాలం కష్టించి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. భూగర్భజలాలు పాతాళానికి పడిపోవడంతో లక్షలు పెట్టుబడులు పెట్టి అదనపు బోర్లు వేయించి నీటి తడులు పెట్టుకుంటున్నారు. కాగా ఆ మార్గం గుండా వెళ్లే ఆకతాయిలు రోడ్డు పక్కన ఉన్న మార్జిన్‌కు నిప్పు పెట్టారు. అసలే వేసవి కావడంతో ఎండి ఉన్న గడ్డి రాజుకుంది. భారీగా మంటలు రేగాయి. మిర్చి, నిమ్మ బత్తాయి తోటలకు ఆ మంటలు పాకాయి. ఆ సమీపంలోనే రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. అయితే పొలాల్లో రైతులు ఘటనను చేసి వెంటనే యర్రగొండపాలెం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. స్పందించిన స్టేషన్ ఫైర్ ఆఫీసర్ డి మల్యాద్రి అగ్ని మాపక వాహనంతో పాటు తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను ఒక గంట పాటు ఆర్పి అదుపులోకి తెచ్చారు. దీంతో భారీ నష్టం జరగకుండా కాపాడగలిగారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని రైతులు అగ్ని మాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక కేంద్రం హెడ్ కానిస్టేబుల్ సిహెచ్ కాశీ విశ్వనాద్, కానిస్టేబుల్ కృష్ణా నాయక్, రవితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పాము కాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పంగులూరు

పాము కాటుకు వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ముప్పవరం గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన ఇంటూరి చిన్న సిద్దయ్య (54) ఆదివారం సాయంత్రం మేతకోస్తుండగా తాచు పాము సిద్దయ్య కాలుకు కాటు వేసింది. వెంటనే ఒంగోలు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. సిద్దయ్యకు భార్య మాధవి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తెకు ఇటీవలే వివాహం కూడా చేశాడు. సిద్దయ్య మృతి పట్ల గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు గరిమిడి జగన్‌మోహనరావు, తదితరులు సంతాపం తెలిపారు.

చిన్న సిద్దయ్య(ఫైల్)

ప్రతిభామూర్తుల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

ప్రతిభామూర్తుల జీవిత విశేషాలపై సభ

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలోని చిన్ని శాంతయ్య సేవాసదన్‌లో చీమకుర్తి నాగేశ్వరరావు స్మారక కళావేదికపై ప్రతిభామూర్తుల సభ కార్యక్రమం ఆదివారం జరిగింది. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల అధ్యక్షులు షేక్ మస్తాన్ అధ్యక్షత వహించగా మిట్టా కామేశ్వరశర్మ ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ హాస్యనటులు రాజబాబు సినీ జీవిత విశేషాలను లక్కరాజు శ్రీనివాసరావు సభకు వివరించారు. మధురకవి మల్లవరపు జాన్ సాహిత్య విశేషాలను నిమ్మరాజు నాగేశ్వరరావు సభకు తెలిపారు. మొదటగా ప్రతిభామూర్తుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఇట్ట వెంకటేశ్వర్లు, మన్నం త్రిమూర్తులు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఆర్‌వి రాఘవరావు, వారణాసి రాఘవశర్మ, అద్దంకి లేవీ ప్రసాద్, మల్లాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, పిసిహెచ్ కోటయ్య, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అంకితభావంతో పనిచేసేవారికి గుర్తింపు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేసే వారికి నిరంతర గుర్తింపు లభిస్తుందని మండల విద్యాశాఖ అధికారి నీలం దేవరాజ్ తెలిపారు. భట్టిప్రోలు గ్రామానికి చెందిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు జి మల్లికార్జునరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ గత 37 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో మల్లికార్జునరావు ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన శిష్యులు అనేకమంది ఉన్నత శిఖరాలు అధిరోహించారని, ఆయన సేవలకు ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కమిటీ సభ్యులు వి సురేష్ కుమార్, ఎం శ్రీనివాసరావు, యోగేశ్వరరావు, మరియు ఆర్యవైశ్య సంఘం నాయకులు తునుగుంట్ల సాయిబాబా, శనగపల్లి శ్రీనివాసరావు తదితరులున్నారు.

కార్యక్రమాల పోస్టర్లను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు

ప్రీ స్కూల్ కార్యక్రమాలను విస్తృత పర్చాలి

ప్రజాశక్తి-వేమూరు

ప్రీస్కూల్ విద్యార్థులకు నిర్వ హించే కార్యక్రమాల ను మరింత విస్తృత పర్చాలని చుండూ రు మండల ఎంఈఓ చలపతి రావు సూచించారు. జ్ఞానజ్యోతి 120 రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా చుండూరు మండలం మోదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాలను ఎంఈఓ పాల్గొని అంశాలపై అవగాహన కల్పించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్య, సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల ద్వారా చిన్నారులలో మానసిక స్థితిగతులకు అనుగుణంగా వారికి విద్యను అందించేందుకు అంగన్‌వాడీలకు ఈ శిక్షణ దోహదపడుతుందని అన్నారు. ఈ మేరకు అంగన్‌వాడీలు కేంద్రంలో నిర్వహించే ఆ అంశాలను పోస్టర్ల ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ నాగరాజ కుమారి, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు ఉన్నారు.

గోవాడ తిరునాళ్లకు ఏర్పాట్లు సిద్ధం

ముస్తాబవుతున్న బాల కోటేశ్వరస్వామి దేవస్థానం • భక్తులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు: ఆలయ ఈవో అశోక్‌కుమార్

ప్రజాశక్తి-అమృతలూరు

అత్యంత ప్రతిష్టాత్మకమైన గోవాడ బాల కోటేశ్వరస్వామి దేవస్థానం తిరునాళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు దేవస్థాన ఈవో అశోక్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 28 వరకు నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఆయా శాఖల అధికారుల ద్వారా పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. దేవదాయ శాఖ పర్యవేక్షణలో ఆలయ కమిటీ భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను సిద్ధం చేశామన్నారు. ఈ నెల 26వ తేదీన మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సుమారు రెండు లక్షల మంది భక్తులకు పైగా ఈ తిరుణాలకు వచ్చే అవకాశం ఉందని అశోక్‌కుమార్ తెలిపారు. ఎంతో ప్రసిద్ధి చెందిన గోవాడలోని ఈ దేవస్థానానికి వేమూరు, తెనాలి, రేపల్లె, పొన్నూరు నియోజకవర్గాల పరిధిలో నుంచి భక్తులు ప్రభలను ఏర్పాటు చేసుకుని కుటుంబ సభ్యులతో సహా విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటారని ఆయన పేర్కొన్నారు. రేపల్లె డిఎస్‌పి, ఆర్‌డిఓలతో పాటు వేమూరు, చుండూరు, రేపల్లె సిఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది ఈ తిరుణాలకు తగిన బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. భక్తుల సౌకర్యార్థం రవాణాకు ఇబ్బంది కలగకుండా తెనాలి, రేపల్లె, పొన్నూరు, బాపట్ల ఆర్టీసీ డిపోల నుంచి సుమారు 30 బస్సులకు పైగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవస్థాన ప్రాంగణం పూర్తిగా సిసి కెమెరాల నిఘా పర్యవేక్షణలో ఈ తిరునాళ్ల కొనసాగుతుందని ఆయన వివరించారు. అలాగే ఇక్కడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అమృతలూరు మండల పరిషత్తు నిధుల నుంచి సుమారు రూ.ఐదు లక్షల వ్యయంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి వసతి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తిరుణాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా దేవస్థానం సమీపంలో ఇప్పటికే నాలుగు అన్నదాన సత్రాలు నడుస్తున్నాయని, మరో రెండు సంఘాలు బయట నుంచి అన్నదానం కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నరసరావుపేట కోటప్పకొండ తరువాత అతిపెద్ద తిరునాళ్ల గోవాడ మాత్రమేనని ఆయన అన్నారు.

తిరునాళ్లకు సిద్ధమవుతున్న గోవాడ దేవస్థానం (ఇన్‌సెట్‌లో) ఈవో అశోక్‌కుమార్

అన్ని వసతులతో 'ఆతిథ్యం'

సామాన్యులకు అందుబాటులో మినీ ఫంక్షన్ హాల్

ప్రజాశక్తి-అద్దంకి

అతివేగంగా విస్తరిస్తున్న అద్దంకి పట్టణంలో అన్ని వసతులతో అందరికీ అందుబాటులో షిరిడీ సాయి షాపింగ్ మాల్‌ను ఆతిథ్యం మినీ ఫంక్షన్ హాల్‌గా మార్చినట్లు నాగసూరి శివప్రసాద్ తెలిపారు. మార్కెట్ యార్డ్ దగ్గరలోని శిరిడి సాయి షాపింగ్ మాల్‌ను ఫంక్షన్ హాల్‌గా మార్చి కుటుంబ సభ్యులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అద్దంకిలో ఉన్న పెద్ద ఫంక్షన్ హాల్స్ కొద్దిమందితో జరుపుకునే కార్యక్రమాలకి అణువుగాను అనుకూలంగా లేకపోవడంతో మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బంది పడిన పరిస్థితులను గమనించామని, కేవలం వారిని దృష్టిలో ఉంచుకొని ఈ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. 200 మందితో వేదిక, మరొక రెండు వందలు మందితో భోజనశాల, బఫే సిస్టం వంటి అన్ని ఏర్పాట్లు ఇందులో ఉన్నట్లు ఆయన తెలిపారు. మినీ ఫంక్షన్ హాల్, మీటింగ్ హాల్ ఇందులో ఉన్నాయన్నారు. భోజనాలతో సహా ఈవెంట్ మొత్తం ఎలాంటి రిస్క్ లేకుండా జరుపుకునేలా కూడా ఇందులో ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

అద్దంకి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఏ కార్యక్రమం అయినా ఈ ఫంక్షన్ హాల్‌లో జరుపుకోవచ్చని అన్నారు. ముఖ్యంగా పిల్లల పుట్టిన రోజు ఫంక్షన్లు, ఉద్యోగ విరమణ ఫంక్షన్లు, సన్మాన మహోత్సవాలు, పెళ్లిరోజు ఫంక్షన్లు వంటి అన్ని రకాల ఫంక్షన్లు నిర్వహించుకునేలా ఈ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేశామన్నారు. కాబట్టి ప్రజలు వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ఆతిథ్యం మినీ ఫంక్షన్ హాల్

గురుకుల పాఠశాలలో పరిశీలన

సిబ్బంది సమన్వయ లోపంతో సమస్యలు • మెరుగైన సౌకర్యాలు కల్పించేలా తక్షణ చర్యలు • సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ పద్మజ

ప్రజాశక్తి-రేపల్లె

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో పారిశుధ్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ పద్మజ తెలిపారు. శనివారం మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ఆకస్మిక తనిఖీలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు బహిర్గతమయ్యాయి. ఈ నేపథ్యంలో జిల్లా కోఆర్డినేటర్ పద్మజ ఆదివారం గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల హాస్టల్ పరిసరాలు, టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించారు. స్నానాలకు, టాయిలెట్లకు వెళ్లేందుకు నీటి సరఫరా లేకపోవడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. టాయిలెట్లను రన్నింగ్ వాటర్ పునరుద్ధరణకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాస్టల్‌లో శానిటేషన్ మెరుగుపడేంతవరకు పాఠశాలలో ఉండి ప్రత్యేక పారిశుధ్య నిర్మూలన పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ పర్యవేక్షణ లోపం, సిబ్బంది మధ్య సమన్వయలోపం, టీం వర్క్ లేకపోవడంతో పాఠశాల అధ్వానంగా మారిందని మండిపడ్డారు. పారిశుధ్యాన్ని మెరుగుపరుచుకోవాలని ఎన్నిసార్లు చెప్పినా పెడచెవిన పెట్టారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటేషన్ సూపర్‌వైజర్ తన సిబ్బంది చేత విధులు సక్రమంగా చేయించకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. మంత్రి బాల వీరాంజనేయ స్వామి సూచనల మేరకు విధులలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ప్రిన్సిపల్‌తో పాటు 16 మంది హౌస్ మదర్‌లు, హెల్త్ సూపర్‌వైజర్లకు చార్జ్ మెమో ఇచ్చినట్లు తెలిపారు. పాఠశాలలో పరిశుభ్ర వాతావరణం నెలకొని మెరుగైన సౌకర్యాలు కల్పించేంతవరకు సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మెమోలు తీసుకున్న సిబ్బంది వివరణ తీసుకొని పాఠశాలలో ఉన్న సమస్యలపై నివేదిక రూపొందించి సాంఘిక సంక్షేమ శాఖ సెక్రటరీకి తెలియజేస్తామని తెలిపారు. సెక్రటరీ ఉత్తర్వుల మేరకు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన ప్రిన్సిపల్, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని అన్నారు.

పాఠశాలలో పరిశీలిస్తున్న డిసిఐ

గురుకుల కళాశాల అధ్యాపకులతో సమావేశమైన కో ఆర్డినేటర్

ప్రజాశక్తి
సోమవారం 24 ఫిబ్రవరి 2025

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తా యని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కమల్ స అన్నారు. ఒంగోలు నగరం లోని డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్లో నెహ్రూ యువ కేంద్రం పై భారత్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను స్టెప్ జిల్లా అధికారి శ్రీమ న్నారాయణ మరియు నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి కమల్ స పోటీలను ప్రారంభించారు. కమల్ మాట్లాడుతూ ఈ క్రీడల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ను ప్రోత్సహించి వారిలో ఉన్న ప్రతిభను గుర్తిం చేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని అన్నారు. స్టెప్ అధికారి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ నెహ్రూ కేంద్రం ద్వారా యువత ఆధారంగా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదాయకమని, ఇటువంటి అవకాశాలు ప్రతి యువత సద్వినియోగం చేసుకొని రాష్ట్ర జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కబడ్డీ విజేతలుగా గెలుపొందిన ఆర్డీయాకేటీ కళాశాల టీం, మరియు వాలీబాల్ విజేతలు క్విజ్ కళాశాల టీం సభ్యులకు సర్టిఫికెట్స్, షీల్డ్ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్వికే ఎంటిఎస్ నాగరాజు, వాలంటీర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీడాప్ ద్వారా జాబ్ మేళా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ప్రైజ్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ వారి ద్వారా ఫిబ్రవరి 28న, మార్చి నెల 4, 14, 18 మరియు 28వ తేదీలలో జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు మైనారిటీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ధనలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని మైనారిటీ వర్గాలకు చెందిన అనగా, ముస్లిం, క్రైస్తవ, సిఖ్, బౌద్ధ, జైన మొదలగు యువత ప్రభుత్వ వెబ్ సైటు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కోర్సు వివరాలు, వివిధ జాబ్ మేళాల గురించి సమాచారానికి జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ వారిని సంప్రదించాలని సూచించారు.

హమాలీల పట్ల చిన్నచూపు తగదు

యూనియన్ గౌరవాధ్యక్షులు కాలం సుబ్బారావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

హమాలీల పట్ల చిన్నచూపు తగదని హమాలీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కాలం సుబ్బారావు అన్నారు. ప్రభుత్వం హమా లీలకు పెంచిన కూలి కేవలం మూడు రూపా యలు అమలుకు మీనమేషాలు లెక్కించడం విచారకరమన్నారు. ఆదివారం నాడు ఒంగోలు సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థ హమాలీ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షుడు బిండె ఆంజ నేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యూనియన్ గౌరవాధ్యక్షులు సుబ్బారావు మాట్లాడుతూ పెంచిన మూడు రూపాయల వేతనాన్ని కూడా ఇప్పటివరకు చెల్లించకపోవడం ప్రభుత్వానికి హమాలీల పట్ల ఉన్న చిన్న చూపుకు నిదర్శనమన్నారు. ప్రతినెలా సరుకుల రవాణా మీద పెట్టే శ్రద్ధ, ఆ సరుకులు రవాణా చేసే కార్మికులకు ఉపయోగ పడాలనే ధ్యాస రాష్ట్ర ప్రభుత్వానికి లేదని విమర్శించారు. పెంచిన కూలి 14 నెలలు అరియర్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం చేయడంలో పౌర సరఫరాల సంస్థ

మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని, నిర్ల క్ష్యాన్ని వీడకపోతే కార్మికులు ఉధృత పోరా టాలకు సిద్ధమవుతారని హెచ్చరించారు. నాలుగు సంవత్సరాల క్రితం నుంచి రిటైర్ అయినవారున్నారని, వారిలో పది సంవ త్సరాలు పూర్తయిన వారికి పెన్షన్ రావడం లేదని, ఈ కాలంలో చనిపోయిన కార్మికులకు వాళ్ళ కుటుంబాలకు రావలసిన పిఎఫ్, ఇన్సూ రెన్స్, కుటుంబ సభ్యులకు, పెన్షన్ ఇప్పిం చటంలో అధికారుల వైఫల్యం తీవ్రంగా ఉందని చెప్పారు. అధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడాల న్నారు. ఈ సమస్యలను పరిష్కరించలేని పక్షం లో జిల్లా మేనేజర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. సంవత్సరాల తరబడి పనిచేస్తున్న కార్మికులకు ఇంతవరకు ఇపిఎఫ్ నెంబర్లు ఇవ్వనందున వారికి యూనిఫామ్, దసరా బోనస్, ఇతర సౌకర్యాలు వర్తించటం లేదన్నారు. వేసవిని దష్టిలో పెట్టుకొని స్టాక్ పాయింట్ల వద్ద తాగు నీరు, విశ్రాంతి సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షాన దశలవారీ ఆందోళన చేయవలసి ఉంటుందని, ఆ దిశగా కార్మికులు సిద్ధం కావాలని సూచించారు. సమస్యలపై ఈ నెల 24, 25 తేదీలలో తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వాలని, పరిష్కారం కాని పక్షాన జిల్లా మేనేజర్ కార్యాలయం ముట్టడి చేయాలని పిలుపునిచ్చారు. అప్పటికీ పరిష్కారం కాకుంటే మార్చి 7న ఛలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బత్తుల గోపాలరావు, కోశాధికారి పి కోటేశ్వరరావు, ముఠా కార్మికులు సుబ్బారావు, నాగిరెడ్డి, రంగయ్య శ్రీను, మల్లికార్జున బాబు, ఓబులేసు పాల్గొన్నారు.



వైద్యానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మండవ మురళీకృష్ణ

చిన్నారుల వైద్యానికి రూ.50 వేల సాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దర్శి నియోజకవర్గం పులిపాడులో నివసించే రాఘవేంద్ర, ఎస్తేరు రాణి దంపతులకు ముగ్గురు పిల్లలు. ఈ ముగ్గురు పిల్లలు పుట్టుకతో మస్కులర్ డిస్ట్రోఫిపతీ డిసీజ్ అనే అరుదైన కండరాల వ్యాధితో బాధపడుతున్నారు. రూ.20 లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చేయించినా కూడా వ్యాధి నయం కాలేదు. వారి దగ్గర డబ్బులు మొత్తం అయి పోయాయి. వైద్యానికి డబ్బులు లేని పరిస్థితిలో సూర్య శ్రీ ట్రస్ట్ కి సంప్ర దించారు. స్పందించిన ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ షహనాజ్ ప్రవాస భార తీయుడు శ్రీనివాసులు పోకల సహకారంతో 50 వేల రూపాయలను ఆదివారం ట్రస్టు కార్యాలయంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీ కృష్ణ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో సర్దార్, షహనాజ్ పాల్గొన్నారు.

ఎంపికైన హాకీ జట్టు..

జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో పాల్గొనే జిల్లా సీనియర్ పురుషుల జట్టు ఎంపిక ఆదివారం జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒం గోలులోని మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించారు. ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన 19 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో రాఘవేంద్ర, యువరాజు, భాను ప్రకాష్, రాము, భరత్, శ్రీకాంత్, మోహన్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, రాజేష్ బాబు, వీరాంజనేయులు, గణేష్, కార్తీక్, బాలశివకుమార్, కాలేషా, మణికంఠ, సందీప్, అశోక్, సుధాకర్ ఉన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి ఏ.సుందర రామిరెడ్డి మాట్లాడుతూ ఎంపికైన జట్టు మార్చి 6, 7, 8 తేదీలలో గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఎంపిక ప్రక్రియను జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో చంద్రశేఖర్, టి. రవికుమార్, పి. రవి పర్యవేక్షించారు.

విస్తృతంగా ఎన్నికల ప్రచారం

- నేరుగా పట్టభద్రులను కలుస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావు
- కూటమి అభ్యర్థి తరపున ఎన్నికల రంగంలో మంత్రులు, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 27న జరగనున్న నేపథ్యంలో ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. ఈ ఎన్నికకు సంబంధించి బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాలకు చెందిన 12 మండలాల్లో ఉన్న 24,440 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జిల్లా పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే 12 మండలాలలో 28 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 25 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ప్రధాన పోటీ పిడిఎఫ్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ల మధ్యే ఉంది.

ప్రభుత్వంలో ఎవరున్నా.. అందరికీ అనునిత్యం అందుబాటులో ఉంటూ.. 14 సంవత్సరాలుగా శాసనమండలిలో అనేక ప్రజాసమస్యలపై ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తన గళం వినిపించారు. వివిధ రంగాల సమస్యలపై నిత్యం స్పందిస్తూ.. వివాదరహితునిగా పేరు పొందారు. ప్రజా ఉద్యమనేతగా అందరికీ సుపరిచితుడైన లక్ష్మణరావు గెలుపు కోసం ప్రజాసంఘాల నేతలు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు మండలాల వారీగా సుడిగాలి పర్యటనలు చేస్తూ అందరినీ కలుస్తున్నారు. వీరితో పాటు ప్రజాసంఘాల, ఉపాధ్యాయ సంఘాల నేతలు 'పెద్దల సభకు పెద్దలనే ఎన్నుకుందాం.. పట్టభద్రుల స్థానం నుంచి నిత్యం సమస్యలపై పోరాడే విద్యావంతులనే గెలిపించుకుందాం..' అన్న నినాదంతో లక్ష్మణరావు గెలుపునకు తమ వంతు కృషి చేస్తున్నారు. అధ్యాపకునిగా ఉన్న లక్ష్మణరావు లాంటి సగటు మనిషి ఇప్పటివరకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవగలిగారంటే పట్టభద్రుల చైతన్యం వల్లనే సాధ్యమైందని, ఈ పర్యాయం కూడా రాజకీయాల్లో విలువను పెంచే

ఉద్యోగులతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు (ఫైల్)

లక్ష్మణరావును గెలిపించుకోవలసిన అవసరం గురించి విస్తృత ప్రచారం చేస్తున్నారు.

కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మంత్రులు, ఎమ్మెల్యేల అండతో ఎన్నికల ప్రచారం చేపట్టారు. తొమ్మిది నెలల క్రితమే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ కొద్ది సమయంలో ఓటర్ల ఆలోచనల్లో పెద్దగా మార్పు ఉండదని తమ అభ్యర్థి సునాయాసంగా గెలుస్తారని టిడిపి నేతలు భావిస్తున్నారు. కానీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అధికార పార్టీ నేతలు సంపాదనే ధ్యేయంగా ఆదాయవనరుల అన్వేషణలో పడ్డారు. రేషన్ దందా, ఇసుక అక్రమ తరలింపులు, మద్యం సిండికేట్లను తమ కనుసన్నల్లోకి తెచ్చుకోవడం, జోరుగా కోళ్లపందేల నిర్వహణతో తమ నియోజకవర్గాల్లో ఓటర్ల ముందు చులకనయ్యారు. గత ప్రభుత్వ హయాంలో వైసిపి నేతల అక్రమాలను మించిన రీతిలో వ్యవహరిస్తూ.. వస్తున్నారు. ఇలాంటి కారణాలతో పట్టభద్రులు అత్యధికులు కూటమి అభ్యర్థి పట్ల సుముఖంగానే లేనట్లు వెల్లడయింది. దీంతో పాటు ఇటీవల ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు తమకు అనుకూలురుగా ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తూ మిగిలిన వారిని పట్టించుకోవడం మానేశారు. ఈ కారణంతో వారు అసంతృప్తితో ఉన్నారు. ఇలా పలుకారణాలతో కూటమి అభ్యర్థి గడ్డుపరిస్థితులను ఎదుర్కొంటున్నారు. సర్వేలు కూడా భిన్నంగా ఉన్న నేపథ్యంలో టిడిపి అధిష్టానం ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు బాధ్యతలను మంత్రులను అప్పజెప్పింది. ఓట్లు కొనుగోలు చేసే సన్నాహాల్లో అధికార పార్టీ నేతలున్నట్లు తెలుస్తోంది.

కూటమి నేతలకు ఓటమి భయం

కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో సునాయసంగా గెలుస్తామని భావించిన కూటమి నేతలకు ఓటమి భయం పట్టుకున్నట్లు ఉంది. తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారా పిడిఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావుపై అసత్యాలతో కూడిన వార్తా కథనాలను ప్రచారంలో పెడుతున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని పలు సమస్యలపై కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు లక్ష్మణరావు వెళ్ళిన సందర్భంలో చేతి నుంచి జారి కింద పడిన వినతిపత్రం కాపీని తీసుకుంటున్న వీడియోలోని భాగాన్ని ఎడిట్ చేసి దాన్ని ప్రచారంలో పెట్టి జగన్‌మోహన్‌రెడ్డి కాళ్లకు లక్ష్మణరావు నమస్కరిస్తున్నట్లు చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే ప్రస్తుతం తాడేపల్లిలోనే లేని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నట్లు, గుంటూరు జిల్లా నేతలతో సమావేశమైనట్లు, ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించినట్లు కట్టుకథలు అల్లి మీడియా, ఇతర సోషల్ మీడియా గ్రూపులలో పోస్టులు పెట్టడం చేస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు వస్తున్న ఆదరణను సహించలేక కూటమి అభ్యర్థి ఆలపాటి వర్గీయులు దిగజారుడు రాజకీయాలు, తప్పుడు ప్రచారాలకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ఇవేవీ పట్టించుకోని పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు హుందాతనంతో వ్యవహరిస్తూ తనదైన శైలిలో పట్టభద్ర ఓటర్లను స్వయంగా కలుస్తూ.. ప్రచారం నిర్వహిస్తున్నారు.

లాభసాటిగా మొక్కజొన్న సాగు

మొక్కజొన్న పంట చేసిన జయరామిరెడ్డి

ప్రజాశక్తి-దర్శి

మొక్కజొన్న పంట సాగర్ ఆయకట్టు పరిధిలోని మెట్ట పొలాల్లో ఇంజన్లతో సాగర్ నీటిని పెట్టి రైతులు కొంత మంది సాగు చేశారు. మండలంలోని తూర్పు చౌటపాలెం గ్రామానికి చెందిన పలువురు రైతులు తూర్పుచౌటపాలెం నుండి రాజంపల్లి వెళ్లే దారిలోని పొలాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఈ ఏడాది మొక్కజొన్న పంట బాగా లాభసాటిగా ఉందని రైతులు పేర్కొన్నారు. తూర్పుచౌటపాలెం గ్రామానికి చెందిన మారం జయరామిరెడ్డి తన రెండెకరాలు మొక్కజొన్న పంట సాగు చేసినట్లు తెలిపారు. సాగరు ఆయకట్టు పరిధి ఉన్నప్పటికీ కాల్వ ద్వారా నీరు ఆ పొలాలకు రావని ఇంజన్ల ద్వారా నీటిని మళ్లించి చాడగట్టి మొక్కజొన్న, బొప్పాయి తోటలు, కొంతమంది కరివేపాకు సాగు చేసినట్లు తెలిపారు. తాను రెండెకరాలు మొక్కజొన్న పంటకు రూ.40వేలు మాత్రమే ఖర్చుపెట్టి సాగు చేసినట్లు తెలిపారు. అయితే ఎకరానికి 30 నుండి 40 బస్తాలు చొప్పున పంట వస్తుందని తెలిపారు. ఒక క్వింటా రూ.2100 చొప్పున 30 బస్తాలు అమ్మితే రూ.60వేలు వస్తుందని తెలిపారు. రూ.30వేలు ఖర్చులు పోయిన రూ.30వేలు మిగులుతాయని, వరి కూడా లాభసాటిగా లేదని తెలిపారు. ఆయిల్ ఇంజన్లతో నీటిని పెట్టుకుని మెట్ట సాగు చేసిన పొలాల్లో లాభసాటిగా ఉన్న వాటిలో రెండు వందల ఎకరాలపైగా మొక్కజొన్న సాగు చేసినట్లు తెలిపారు. బొప్పాయి, మిరప, కరేపాకు సాగు చేసినట్లు పేర్కొన్నారు. రైతులు లాభసాటి పంటను ఎంచుకొని నూతనంగా పండిస్తూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తున్నారు.

మెట్ట పైర్లకు ఇంజన్ల ద్వారా నీటి పెడుతున్న రైతులు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ కందుల నారాయణరెడ్డి

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పొదిలి

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. పట్టణంలోని శ్రీ నిర్మా మహేశ్వర స్వామి దేవస్థానం శివరాత్రి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్, కరపత్రికను ఆయన తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి నర్రా నారాయణరెడ్డి, శివాలయం నూతన చైర్మన్‌గా ప్రకటించిన ఒగ్గు వెంకట రామయ్య, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, ఆవులూరి యలమంద, తానికొండ వెంకట్రావు, దేవాలయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలగుల్ల ముత్యాలను సన్మానిస్తున్న వైసీపీ నాయకులు

పాలుగుళ్లను సన్మానించిన వైసీపీ నాయకులు

ప్రజాశక్తి-సిఎస్.పురం

వైసిపి మండడల అధ్యక్షులుగా ఎన్నికైన ఉప్పలపాడు గ్రామానికి చెందిన పాలుగుళ్ళ మల్లికార్జునరెడ్డిని, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అయ్యలూరివారిపల్లి గ్రామానికి చెందిన ముత్యాల నారాయణరెడ్డిని పలువురు వైసిపి నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇరువురికి శాలువాలు కప్పి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి పదవులు కట్టబెట్టిన మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, వైసీపీ నాయకులు దుగ్గిరెడ్డి జయరెడ్డి, పులిమాలి, వర్మ సిద్దు వెంకట్‌రెడ్డి, తోట అశోక్, నల్లి రాహుల్, చోడ రవి, రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, బసివి శేఖర్ పాల్గొన్నారు.

పురంధేశ్వరిని కలిసిన 'పాములపాటి'

ప్రజాశక్తి-సిఎస్.పురం

బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంటు సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరిని మండలంలోని మిట్టపాలెం నారాయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పాములపాటి మాధవప్రసాద్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మహాశివరాత్రికి మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానానికి రావాలని ఆహ్వానించారు. ప్రముఖ పర్యాటక క్షేత్రమైన భైరవకోనను సందర్శించాలని కోరారు. ఈ రెండు ఆలయాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని ఆమె చెప్పినట్లు మాధవప్రసాద్ తెలిపారు. అనంతరం ఆమెకు నారాయణస్వామి శేష వస్త్రాన్ని, చిత్రపటాన్ని బహుకరించారు.

పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న డీఎస్పీ బి లక్ష్మీనారాయణ

విద్యార్థులు ఇష్టంగా చదవాలి

ప్రజాశక్తి-దర్శి

విద్యార్థులు క్రమశిక్షణతో ఇష్టపడి చదివి పోటీ ప్రపంచంలో రాణించాలని డిఎస్పి బి లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఎదురుగా ఉన్న గౌతమి గ్రామర్ ఉన్నత పాఠశాల, ఇంటర్ బాలికల కళాశాల 25వ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి పాఠశాల కరస్పాండెంట్ పాపసాని రాజకేశవ రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 25ఏళ్లుగా పాఠశాల అన్ని విధాల విద్యార్థుల ను తీర్చిదిద్దటంలో రాజకేశవరెడ్డి సతీమణి పద్మ కఠోర దీక్ష ఎంతో ఉందన్నారు. ఎన్నో ర్యాంకులు వచ్చాయని, ఇక్కడ చదివిన విద్యార్థులు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా స్థిరపడ్డారని పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులు చిన్నప్పటి నుండే మంచి అలవాట్లు తల్లి దండ్రుల వద్ద నేర్చుకొని, పాఠశాలల్లో క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించాలని అన్నారు. వచ్చే పరీక్షల్లో బాగా రాసి పాఠశాలకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఎన్సీసీ అధికారి రామకృష్ణం రాజు మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. సెల్‌ఫోను అవసరమైతే తప్ప ఎక్కువ వాడకూడదని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు షేక్ గయాజ్, ఎంఇఒ బి రమాదేవి, ప్రభుత్వ జూనియర్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ తారావాణి, ఈశ్వరయ్య, ప్రిన్సిపాల్ రామారావు, సంఘ సేవకులు జివి రత్నం, పాఠశాల పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణచైతన్య పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - పొదిలి

గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసిపి ఇంచార్జ్ అన్నా వెంకట రాంబాబు తనయుడు అన్నా కృష్ణ చైతన్య జన్మదిన వేడుకలు స్థానిక వైసిపి నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైసిపి కార్యాలయంలో కృష్ణ చైతన్య జన్మదిన కేకును కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రెటరీ సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు గుజ్జుల సంజీవరెడ్డి, పట్టణ మాజీ కన్వీనర్ షేక్ రబ్బానీ భాష, సేవాదళ్ మండల అధ్యక్షులు వర్షం ఫిరోజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ మస్తాన్ వలి పాల్గొన్నారు.

కొనకనమిట్ల : మార్కాపురం నియోజకవర్గ యువనాయకులు అన్నా కృష్ణచైతన్య జన్మదిన సందర్భంగా ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని, ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. కార్యక్ర మంలో జడ్‌పిటిసి ఏడుకొండలు, వైస్‌ఎంపిపి మెట్టు వెంకటరెడ్డి, కంకణాల రమేష్, గాడి కోనేటిరెడ్డి, తంగిరాల బ్రహ్మారెడ్డి, వాగుమడుగు మాజీ సర్పంచ్ శ్రీను, వెలుగొండరాయుడు, ఎంపిపి మూరబోయిన మురళీకృష్ణ, వైసిపి ఉపాధ్యక్షులు మాజీ జడ్‌పిటిసి మెట్టు వెంకటరెడ్డి, వెలిగండ్ల, మునగపాడు, గనివెన పాడు, మంగాపురం సర్పంచులు పాతకోట వెంకటరెడ్డి, పార్లపల్లి నబి, పాలూరి లక్ష్మీవెంకటేశ్వర్లు, బేతా ప్రకాష్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం మాజీ మండల అధ్యక్షులు శ్రీనివాసులు, మాజీ ఎంపీటిసి శేఖర్ పాల్గొన్నారు.

కృష్ణ చైతన్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపిపి, జడ్‌పిటిసి

వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎంఎల్ఎ ఉడుముల

వధూవరులకు 'ఉడుముల' ఆశీర్వాదం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని సిద్దవరం గ్రామంలో షేక్ కాశిం కుమారుడు మీరావలి వివాహానికి కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి హాజరై వధూ, వరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపిపి మురళికృష్ణ, మోర శంకర్‌రెడ్డి, సచివాలయం మాజీ కన్వీనర్ సురవరపు పెద్దవెంకటరెడ్డి, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి సంజీవరెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు కామసాని వెంకటేశ్వర్లురెడ్డి, మందలపు శ్రీనివాసులురెడ్డి, ఎంపిటిసి సభ్యుడు షేక్ మీరావలి, మాజీ శివాలయం చైర్మన్ కంకణాల రమేష్, మాజీ ఎంపీటీసీ బాల అంకయ్య, కంభంపాటి నాగేశ్వరావు, తిరుమలరెడ్డి నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న పమిడిమర్రి శ్రీనివాసులు

మానవత సంస్థకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పొదిలి

ప్రజా సంక్షేమ కోసం పలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మానవతా సేవా సంస్థకు ఉపాధ్యక్షులు పమిడిమర్రి శ్రీనివాసులు రూ.25వేల ఆర్థిక సహాయం అందించారు. సంస్థ నెలవారీ సమీక్షా సమావేశం కె ఎలమందారెడ్డి అధ్యక్షతన శ్రీ వాసవి షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించారు. మహాశివరాత్రి పండుగ సందర్భంగా చేయవలసిన కార్యక్రమాలు చర్చించారు. రథోత్సవం సందర్భంగా ప్రజలందరికీ చల్లని మజ్జిగ అందించాలని, పట్టణంలో సిమెంట్ బల్లాలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని పేర్కొన్నారు. దాతలు సహకరించాలని కోరారు. ఈ పాటికే అనేక సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, పేదల సౌకర్యార్థం వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కాటూరి వెంకటనారాయణ బాబు, కళ్ళం సుబ్బారెడ్డి, కరిముల్లా బేగ్, భవాని శ్రీను, మేడ అనంత శ్రీనివాసరావు, జి శ్రీను, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సోమిశెట్టి చిరంజీవి, భాష, అశోక్ పాల్గొన్నారు.

ప్రయాణంలో ప్రమాదాలు

- పరిమితికి మించి ప్రయాణికుల తరలింపు
- అదుపు తప్పుతున్న వాహనాలు
- పోలీసులు హెచ్చరిస్తున్నా మారని తీరు

వ్యవసాయ కూలీలను తరలిస్తున్న లగేజీ ఆటో

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న వాహనాలు ఏమాత్రం అదుపుతప్పినా పెను ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. గత ఆదివారం (ఫిబ్రవరి 16) పెద్దారవీడు మండలం చట్లమిట్ల నుంచి మార్కాపురం పట్టణానికి వస్తున్న ట్రాలీ ఆటో అదుపు తప్పడంతో సంఘటనలో ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందారు. ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా మిగిలినవారు స్వల్ప గాయాలతో గాయపడ్డారు. వీరిలో కొంతమంది ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ఇలాంటి దుర్ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. పరిమితికి మించిన ప్రయాణికులతో అతివేగంగా వెళ్లడమే కారణమని పోలీసులు చెబుతున్నారు. వారు ఎన్ని హెచ్చరికలు చేసినా ప్రైవేట్ వాహనదారుల్లో ఏమాత్రం మార్పు కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మార్కాపురం మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది ప్రజలు, కూలీలు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. అయితే వారికి సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రమాదమని తెలిసినప్పటికీ కిక్కిరిసిన ఆటోలలోనే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. బతుకు దెరువు కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం పట్టణాలకు, ఇతర ప్రాంతాలకు ఎంతోమంది కూలీలు సరైన బస్సు సౌకర్యం లేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు వాహనదారులు నిబంధనలకు నీళ్లొదిలి పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వాహనాలను నడుపుతున్నారు. ఫలితంగా అనేక ప్రమాదాలు జరిగాయి. జరుగుతూనే ఉన్నాయి. ఈ కారణంగా ఎంతో మంది వికలాంగులయ్యారు. మరికొందరు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. కూలికి వెళ్లిన వ్యక్తులు క్షేమంగా ఇంటికి చేరే వరకు ఆయా కుటుంబాల్లో ఆందోళనే. కష్టజీవుల ప్రాణాలతో చెలగాటమాడే వారిపై చర్యలు తీసుకునేవారు కరువవడంతో ఆటోవాళ్ల వ్యవహారం ఇష్టారాజ్యంగా మారింది. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే ఉద్దేశంతో ఆటో డ్రైవర్లు పరిమితికి మించిన ప్రయాణికులతో మితిమీరిన వేగంతో తీసుకెళుతున్నారు. నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో, రహదారులపై మలుపుల్లో బోర్లా పడటం, ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ప్రమాదాలు జరగటం, అక్కడికక్కడే సర్దుబాటు చేసుకొని వెళుతుండటం సర్వసాధారణమైంది. అంతేకాక ఆటోలకు సరైన పత్రాలు లేకపోవడం, డ్రైవర్లకు లైసెన్సులు లేకపోవడంతో ప్రమాదాలకు గురైన వారికి బీమా కూడా అందటంలేదు. దీనికి తోడు కొంతమంది డ్రైవర్లు మద్యం సేవించి, సెల్ ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమౌతున్నారు. మరికొంత మంది చిన్నవయస్సులోనే అవగాహన లేకుండా తెలిసీ తెలియని డ్రైవింగ్ చేస్తూ, మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతూ నియంత్రించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా వాహనాల రాకపోకలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనాఉంది.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి: సిఐ పి సుబ్బారావు

ఆటో డ్రైవర్లు, ప్రైవేటు వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని, ఎవరైనా అతిక్రమించి ప్రయాణికులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మార్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి సుబ్బారావు హెచ్చరించారు. సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఆటో నడిపే ప్రతి ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్, ప్రమాద బీమా కలిగి ఉండాలన్నారు. రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలు ఆపి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. ప్రయాణికులను ఎక్కించుకునేటప్పుడు, దించేటప్పుడు రోడ్డుకు పూర్తిగా పక్కకు వెళ్లి ఆపాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించవద్దన్నారు. అప్రమత్తంగా ఉంటే రోడ్డు ప్రమాదాలను ఎక్కువ శాతం నివారించవచ్చని అన్నారు.

1,196 మందికి ఆరోగ్య పరీక్షలు

- ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన
- వేకువ జాము నుంచే క్యూ కట్టిన షుగర్ బాధితులు

ప్రజాశక్తి-చీరాల

వాడరేవు రామానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమం ఆవరణలో షుగరు వ్యాధికి ఉచిత వైద్య శిభిరం ఆదివారం నిర్వహించారు. వైద్య శిబిరంలో వివిధ ప్రాంతాల నుంచి వేకువ జామునుండే వచ్చిన 1,196 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. నెల రోజులకు సరిపడా మందులు ఉచితంగా అందజేసినట్లు ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. శిబిరానికి హాజరైన వారందరికీ అల్పాహారం, తాగునీరు, ఇతర సహాయక ఏర్పాట్లు చేశారు. షుగర్ వ్యాధి బాధితులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా వేగంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసే విధంగా విస్తృతమైన ఏర్పాట్లతో మధ్యాహ్నానికే వచ్చిన వారందరికీ వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు అవగాహన కల్పించారు.

వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

రోజువారీ జీవన విధానం మార్చుకోవాలని చెప్పారు. ఆహారపు అలవాట్లు మార్చుకుంటే షుగర్ నియంత్రణలో ఉంటుందని సూచించారు. మానసిక ఆందోళన తగ్గించుకోవాలని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వ్యాయామం, నడక అలవాటు చేసుకోవాలని చెప్పారు. వైద్య శిబిరంలో డాక్టర్ ఎం రాజరాజేశ్వరి, డాక్టర్ కమలా రాజేశ్వరి, డాక్టర్ లలిత్ ప్రకాష్, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ ప్రకాష్ వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె కృష్ణారావు, సాయి ఫణికిషోర్, చందన, కామేశ్వరరావు, ఎంజి శంకరరావు, బసవరావు, కుమార్, ఎ సురేష్, మిత్ర ల్యాబ్ వలి, గోపాల్, వాడరేవు స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, చీరాల మహిళా కళాశాల విద్యార్థులు రోగులకు ఆహారం, తాగునీటి వసతులు, సహాయక ఏర్పాట్లు చేశారు.

బాపట్ల జిల్లా వాసుల కవితలకు..

అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

ప్రజాశక్తి-అద్దంకి

చందలూరి నారాయణరావు, ఆర్‌వి రాఘవరావు

అంతర్జాతీయ స్థాయిలో వీక్షణం (సాహితీ గవాక్షం) కాలిఫోర్నియా వారు నిర్వహిస్తున్న 150వ సాహితీ సమావేశం సందర్భంగా ఓ ప్రత్యేక వచన కవిత్వ సంచిక నిమిత్తం దేశ విదేశాల్లో ఉన్న 150 మంది తెలుగు కవుల నుంచి 150 కవితలను ఎంపిక చేశారు. అందులో అద్దంకికి చెందిన చందలూరి నారాయణరావు రాసిన 'చెట్టు కళేబరం', ఆర్‌వి రాఘవరావు రాసిన ప్రస్థానం కవిత ఎంపికైనట్లు సంస్థ నిర్వాహకులు డాక్టర్ కే గీత మాధవి, గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. బాపట్ల జిల్లా సాహితీ స్రవంతి అధ్యక్షుడిగా పనిచేస్తున్న చందలూరి నారాయణరావు అద్దంకి మండలం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచరుగా పనిచేస్తున్నారు. గతంలో మనం కాసేపు మాట్లాడుకుందాం (2018), మనిషి గుర్తుల్ని బతికించుకుందాం (2022) అనే కవితా సంపుటిలతో గుర్తింపు పొందారు. ఇప్పటి వరకు వీరు రాసిన 1200 పైగా కవితలు పలు పత్రికల్లో ప్రచురిత మవడం విశేషం. ఈ కవితలు పలుసార్లు రేడియోలో ప్రసారం అయ్యాయి. ఆర్‌వి రాఘవరావు గతంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశారు. అనేక సాహిత్య ప్రసంగాలు, సినీ సాహిత్యం గురించి అనేక వ్యాసాలు రాశారు. సినీ కవులు, రచయితల గురించి రేడియోలో ప్రసంగించారు. ఈయన రాసిన కవితలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఈ సందర్భంగా నారాయణరావు, ఆర్‌వి రాఘవరావును ప్రముఖ సాహితీ విమర్శకులు అన్నమనేని వెంకట్రావు, డాక్టర్ వలివేటి సుబ్బారావు, సత్యనారాయణ, గాడేపల్లి దివాకర్ దత్తు, ఇలపావులూరి శేషతల్పసాయి, మిట్టా కామేశ్వరశర్మ, బాలు, లక్కరాజు శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

మండల వ్యవసాయ శాఖ అధికారి విజయబాబు

ప్రజాశక్తి-రేపల్లె

రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికరించేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార్ కార్డు తరహాలో ప్రత్యేక గుర్తింపు కార్డు ఇవ్వనున్నట్లు రేపల్లె మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ విజయబాబు తెలిపారు. ఆదివారం రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని దోనేపూడి అరవపల్లి గ్రామాలలో రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు సొంత భూమి కలిగిన రైతు మాత్రమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు రాయితీలు పొందాలంటే ఈ 14 అంకెలు గల విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్డు ఉండాలని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రాయితీల పెట్టుబడి, ఎరువుల రాయితీలు, పంటల బీమా, కనీస మద్దతు ధర, పంట రుణాలు, వివిధ రకాల వ్యవసాయ అనుబంధ రంగాల పంటలకు సంబంధించిన ఉపయోగాలు ఉన్నాయని ఆయన వివరించారు. కావున సొంత భూమి గల రైతులు తప్పనిసరిగా ఈ రైతు విశిష్ట సంఖ్య నమోదును మీ గ్రామాలలో ఉండే విలేజి అగ్రికల్చరల్ అసిస్టెంట్లను రైతు సేవా కేంద్రాల వద్ద కు వెళ్లి.. నమోదు చేయించుకోవాల్సిందిగా ఆయన కోరారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నెంబరు తీసుకొని రావాలని ఆయన రైతులకు సూచించారు.

నివాళు లర్పిస్తున్న మాబు తదితరులు

తవనం చెంచయ్య, కోటయ్యలకు నివాళి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మాజీ శాసనసభ్యులు తవనం చెంచయ్య, సిపిఎం జిల్లా నాయకులు పమిడి కోటయ్యల వర్ధంతుల సందర్భంగా ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు, మండల కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, మండల నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్, దాసరి చినబాబు, ఎన్‌వి నరసింహం తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రోటరీ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-చీరాల

రోటరీ క్లబ్, పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా ఆంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో చీరాల రోటరీ సామాజిక భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 148 మందికి శంకర్ కంటి ఆసుపత్రి నుంచి వచ్చిన అనుభవజ్ఞులైన డాక్టర్లు అబోలి, మేఘన పర్యవేక్షణలో కంటి పరీక్షలు చేశారు. కంటి శుక్లం సర్జరీకి 25 మందిని సిఫార్సు చేశారు. వీరిలో 15 మందిని సర్జరీకి తీసుకు వెళ్లినట్లు రోటరీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో చందలూరి బాలవెంకటేశ్వరరావు, నక్కల సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, బి హేమంత్ కుమార్, మామిడాల శ్రీనివాసరావు, జివై ప్రసాద్, ప్రతాప్, రఘుకుమార్, మురళీకృష్ణ, పూర్ణ, శ్రీనివాసరావు, శ్రీనివాసబాబు, డివి సురేష్, హాస్పిటల్ ఇన్‌ఛార్జి నాగబాబు పాల్గొన్నారు.

వైద్య సంబంధిత వస్తువులు అందజేస్తున్న బసవేశ్వరరావు

ఉచిత వైద్యానికి తోడ్పాటు

ప్రజాశక్తి-వేటపాలెం

ప్రజలకు ఉచిత సేవలు అందజేయడం అభినందనీయమని పందిళ్లపల్లి టిడిపి సీనియర్ నాయకులు ఏరాసు బసవేశ్వరరావు అన్నారు. ఆదివారం పందిళ్లపల్లి గ్రామంలో మధుమేహ వ్యాధిగ్రస్తులకు, ప్రమాదాలలో గాయాలు తగిలిన వారికి కట్లు కట్టి వారికి ఉపశమనం కలగజేస్తూ ఉచిత సేవలు అందజేస్తున్న పమిడాల సుబ్బారావు అలియాస్ షారుక్ ఖాన్‌కు కట్టు కట్టేందుకు ఉపయోగపడే మెటీరియల్, మందులు ఉచితంగా అందజేసి సుబ్బారావు చేసే ఉచిత సేవలకు తోడ్పాటు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరిసర ప్రాంత ప్రజలు ఎంతోమందికి ఉచిత సేవలు అందించి ఉపశమనం కలగజేస్తున్న సుబ్బారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఇంటర్ పరీక్షలలో అలసత్వం వద్దు

- విద్యార్థులను తనిఖీ చేసి పంపాలి
- ఫీజులపై ఒత్తిడి చేస్తే కఠినచర్యలు
- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ విధులలో ఏమాత్రం అలసత్వం, నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఒంగోలు ఏకె,వికె డిగ్రీ కళాశాలలో ఆదివారం పరీక్షల విధులలో పాల్గొనే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు, కస్టోడియన్లు, అదనపు చీఫ్ సూపరింటెండెంట్లు, స్క్వాడ్ సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా కేంద్రాలలో పరీక్షల నిర్వహణలో మీదే కీలక పాత్ర అని తెలిపారు. పరీక్ష కేంద్రంపై చీఫ్ సూపరింటెండెంట్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. ప్రతి సంవత్సరం చేస్తున్న డ్యూటీయే కదా అని తేలికగా తీసుకునే ఆలోచనా ధోరణి ఉండరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వేటినీ అనుమతించరాదని స్పష్టం చేశారు. తనిఖీలు, పరీక్షల నిర్వహణలో పకడ్బందీగా ఉండాలని, విద్యార్థులు ఒత్తిడికి గురయ్యేలా వారి పట్ల అనుచితంగా వ్యవహరించరాదన్నారు. తమ కేంద్రాల్లో పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాల్సిన బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్లదే అని స్పష్టం చేశారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించి జిల్లా యంత్రాంగానికి అప్రతిష్ట తీసుకువస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు. హాల్ టికెట్లు మంజూరు చేయాలంటే పెండింగ్‌లోని కళాశాల / మెస్ ఫీజు చెల్లించాలని విద్యార్థులపై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. వాట్సాప్ ద్వారా విద్యార్థులు వారి హాల్ టికెట్లను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐఒ ఏ. సైమన్ విక్టర్, ఇంటర్మీడియట్ పరీక్షల ప్రత్యేక అధికారి ఐ.శ్రీనివాసరావు, ఎగ్జామ్స్ కంట్రోలర్ వివి సుబ్బారావు, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు ఆంజనేయులు, చంద్రశేఖర్, కోటేశ్వరరావు, స్వరూప రాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ లబ్దిదారులకు

అత్యున్నత స్థాయి వైద్యసేవలు

- ఎండీ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు
- ఒంగోలులో ఆస్టర్ రమేష్ 'ఎన్టీఆర్ వైద్యసేవ' హాస్పిటల్ ప్రారంభం

ఆస్టర్ రమేష్ ఆర్యోగ్యశ్రీ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, ఎండీ రమేష్‌బాబు

ప్రజాశక్తి-ఒంగోలు

ప్రజల అభీష్టాన్ని దష్టిలో ఉంచుకొని ఎకానమీ మరియు ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) స్కీమ్ లబ్ధిదారులకు కూడా అత్యున్నత స్థాయి వైద్య సేవలు అందించేందుకు ఇప్పటికే ఉన్న 150 పడకల హాస్పిటల్‌ను అదనంగా మరో 100 పడకలతో విస్తరించామని హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు తెలియజేశారు. ఒంగోలులో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వద్దే కొత్తగా ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు నాణ్యమైన, స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ మరియు బర్త్ అండ్ బియాండ్ అనే బ్రాండ్ పేరుతో తల్లీ, పిల్లల వైద్యవిభాగం హాస్పిటల్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ హాస్పిటల్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆదివారం ప్రారంభించి.. మాట్లాడారు. ఒంగోలులో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఆధునిక వైద్యం అందించేందుకు ముందుకొచ్చిన ఆస్టర్ రమేష్ హాస్పిటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో రెండు ప్రభుత్వ వైద్యశాలలకు ఆస్టర్ రమేష్ యాజమాన్యం పరికరాలు అందించి.. సహకరించినందుకు అభినందించారు.

ఎండీ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో అత్యుత్తమ మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఒంగోలులో సంఘమిత్ర హాస్పిటల్‌ను తీసుకుని గత 8 సంవత్సరాలుగా విజయవంతంగా నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ హాస్పిటల్‌లో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు సేవలు అందిస్తున్నారని చెప్పారు.

ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు అత్యుత్తమ వైద్య సేవలు

ఒంగోలులో కొత్తగా ప్రారంభమైన ఈ హాస్పిటల్ ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు నాణ్యమైన, స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ మరియు బర్త్ అండ్ బియాండ్ అనే బ్రాండ్ పేరుతో తల్లీ,పిల్లల వైద్య విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. టెక్నాలజీ ద్వారా ప్రత్యేకంగా టెలిఐసియు సదుపాయాన్ని ప్రవేశపెట్టడం ద్వారా, ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు అధునాతన వైద్యం 24/7 పొందే అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. ప్రతి పడకకూ రోజుకు రూ.5 వేల ఖర్చయ్యే సూపర్ స్పెషాలిటీ టెలిఐసియు వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా అత్యవసర వైద్య సహాయాన్ని పొందే అవకాశం కల్పించడంతో పాటు, నిపుణులైన వైద్యులు రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తారని చెప్పారు. ఈ హాస్పిటల్ లక్ష్యం ఆరోగ్యశ్రీ రోగులకు అత్యాధునిక వైద్యం అందించడమే కాకుండా ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు వినూత్న కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందన్నారు.

కార్యక్రమంలో గౌరవ అతిథులుగా మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ డీప్ టెక్ నైపుణ్య సంస్థ కన్వీనర్ క్రొసరాజు శ్రీధర్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ స్ట్రాటజీ హెడ్ మధుస్మిత పోతినేని, ఛైర్మన్ మద్దిపాటి సీతారామమోహనరావు, రీజినల్ సీ.ఈ.ఓ దేవానంద్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, సీనియర్ జనరల్ మేనేజర్ జ్యేష్ఠ రాజశేఖర్ పాల్గొన్నారు.

'పర్యాటక ప్రకాశం'గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు

- జిల్లాలో ఆరు ప్రధాన పర్యాటక క్షేత్రాలు
- పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు..
- ప్రకాశం జిల్లా టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ జిల్లా అధికారి కొప్పుల విల్సన్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జిల్లాను 'పర్యాటక ప్రకాశం'గా రూపుదిద్దేందుకు పుష్కళమైన వనరులున్నాయని ప్రకాశం జిల్లా టూరిజం డెవలప్మెంట్ అథారిటీ జిల్లా అధికారి కొప్పుల విల్సన్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో అయిదారు ప్రాంతాలు పర్యాటక క్షేత్రాలుగా విరాజిల్లుతున్నాయన్నారు. వీటితోపాటు మరికొన్నింటికి సొబగులు అద్దితే స్వదేశీ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు వీలవుతుంది. ప్రకాశం జిల్లా వైభవాన్ని నలుచెరగులా చాటిచెప్పేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుందన్నారు. వీటికి సంబంధించి పలు ప్రణాళికలు రూపొందించామంటున్న ఆయనతో 'ప్రజాశక్తి' ముఖాముఖి..

జిల్లాలో ఆరు ప్రధానమైన పర్యాటక క్షేత్రాలు..

ప్రస్తుత ప్రకాశం జిల్లాలో చారిత్రాత్మక, వినోదాత్మిక, ఆధ్యాత్మిక, ఆహ్లాదభరితమైన పర్యాటక స్థలాలలో కొన్ని సహస్సిద్ధంగా ఏర్పడినవి కాగా, కొన్ని అభివద్ధి చేసిన పర్యాటక క్షేత్రాలుగా ఉన్నాయి. వీటితో పాటు రెండు ప్రాంతాల్లో చారిత్రాత్మక స్థలాలు ఉన్నాయి. వీటన్నింటినీ అభివద్ధి పరచడం ద్వారా 'పర్యాటక ప్రకాశం'గా ఫరిడవిల్లేందుకు దోహదపడుతుంది. ముఖ్యంగా పర్యాటకులను ఆకర్షించేందుకు సింగరాయకొండ మండలం పాకల తీరం, కొత్తపట్నం మండలం 'కొత్తపట్నం బీచ్', సిఎస్ పురం మండలం 'భైరవకోన వాటర్ ఫాల్/గుహాలయం', కురిచేడు మండలం చందవరం వద్ద చారిత్రాత్మక 'బౌద్ధస్తూపం', మద్దిపాడు మండలం మల్లవరం వద్ద 'గుండ్లకమ్మ రిజర్వాయర్', టంగుటూరు ప్రకాశం పంతులు జన్మించిన నాగులుప్పలపాడు మండలం 'వినోదరాయునిపాలెం', ఉప్పు సత్యాగ్రహానికి శ్రీకారం చుట్టిన ఒంగోలు మండలం, 'దేవరంపాడు', ఆసియాలో అతి పెద్దదైన 'కంభం చెరువు' ప్రధానమైన పర్యాటక క్షేత్రాలు. వీటన్నింటినీ అభివద్ధి పరిచి తద్వారా విస్తతంగా పర్యాటకులను ఆకర్షించవచ్చు.

ముఖాముఖి

అభివృద్ధికి ప్రణాళికలు..

ముఖ్యంగా తీరప్రాంతంలో 'పాకల బీచ్' అభివద్ధికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించాం. ఇక్కడ ఈ పాటికే రెస్టారెంట్ పేరున చేపట్టిన అభివద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అక్కడ' ఫుడ్ కోర్టు," కన్వెన్షన్ రూములు' ఇతర వనరులు సమకూర్చుట ద్వారా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దవచ్చు. 'కొత్తపట్నం బీచ్' వద్ద గెస్ట్ హౌస్, కాటేజీల నిర్మాణం, చిల్డ్రన్ పార్క్, ఇతర వనరుల అభివద్ధి పరచడం ద్వారా పర్యాటకులను పెద్ద ఎత్తున ఆకర్షించే వీలుంటుంది. ఈ హంగులు ఏర్పాటుకు రూ.6 కోట్లతో ప్రతిపాదన రూపొందించినట్లు తెలిపారు. భైరవకోన క్షేత్రంలో రెస్టారెంట్,వసతి గదుల నిర్మాణానికి కోటి రూపాయలతో ప్రతిపాదన రూపొందించామన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్ద 'ఒంగోలు గిత్త నమూనా 'బ్యారేజ్ వద్ద 'చిల్డ్రన్ పార్క్' రోప్ వే' ట్రెక్కింగ్ మరియు బోటింగ్ వంటి సౌకర్యాలు అభివద్ధికి రూ.8 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.

'ప్రకాశం పంతులు' స్మారక చిహ్నంగా..

ప్రకాశం పంతులు జన్మించిన నాగుల్పులపాడు మండలం వినోదరాయుని పాలెం 'టంగుటూరి ప్రకాశం పంతులు స్మారక కేంద్రంగా తీర్చిదిద్దాలి.దీనికోసం ఇక్కడ ప్రకాశం పంతులు విగ్రహం తో పాటు,చిల్డ్రన్ పార్క్,ఓపెన్ ఎయిర్ థియేటర్,తాగునీరు,విద్యుత్ సౌకర్యం వంటి వసతులకు రూ 2.16 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించామన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యంలో ఒంగోలు మండలం 'దేవరంపాడు' గ్రామంలో ఉప్పు సత్యాగ్రహానికి శ్రీకారం చుట్టిన కేంద్రం గా ఆ ప్రాశస్త్యం చాటిచెప్పేందుకు అక్కడ బోటింగ్ సౌకర్యం, ఫోటో గ్యాలరీ, సోలార్ సిస్టం, సిట్ఔట్స్ వంటి సదుపాయాల కల్పనకు రూ.2.56 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. కాగా త్రిపురాంతకం బాల త్రిపుర సుందరి దేవి ఆలయం వద్ద కాటేజీ, ఇతర వసతుల ఏర్పాటుకు రూ 1.50 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించామన్నారు. ఆసియాలోనే ప్రసిద్ధిగాంచిన' కంభం చెరువును పర్యాటక కేంద్రంగా, సాగునీరు, తాగునీరు వంటి వనరులు కల్పించే బహుళార్ధక ప్రాజెక్టుగా రూపొందించడానికి ప్రతిపాదనలు రూపొందిస్తామన్నారు.

పాకల తీరం లో 15 ఎకరాలు స్వాధీనం....

సింగరాయకొండ మండలం పాకల తీర ప్రాంతంలో పడావుగా ఉన్న కోట్లాది రూపాయల విలువైన 15 ఎకరాల స్థలాన్ని గుర్తించామన్నారు. భవిష్యత్తు అవసరాల రీత్యా ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కేన్సర్ పై అందరికీ అవగాహన అవసరం

62 మందికి ఉచితంగా పరీక్షలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం, మణిపాల్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో కేన్సర్ పై అవగాహన కార్యక్రమం ఆదివారం జరిగింది. కేన్సర్‌పై అందరికి అవగాహన అవసరమని వారు తెలియజేశారు. మహిళలకు సంబంధించిన పాప్సియర్, మామోగ్రామ్, నోటి కేన్సర్ లకు సంబంధించిన పరీక్షలను 62 మందికి ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు వేముల మాలకొండయ్య, బాలచంద్రం, దాసరి సుధాకర్ ఒంగోలు పట్టణం నుండి పోలవరపు సుధాకర్ , రమేష్ , రాజా , శ్రీను, మణిపాల్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌లో పంచాయతీరాజ్‌కు కేటాయింపులు పెంచాలి

జి.వీరభద్రాచారి డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రానున్న 2025 రాష్ట్ర బడ్జెట్ లో పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి కి అత్యధిక నిధులు కేటాయించాలని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి జి.వీర భద్రాచారి డిమాండ్ చేశారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని బలోపేతం చేయాలని, స్థానిక సంస్థలకు కేంద్ర ఆర్థిక సంఘం వలె జనాభా ప్రాతిపదికగా గ్రామాలకు నిధులు వాటా ఇవ్వాలని కోరారు. ఎన్నికలకు ముందు పంచాయతీరాజ్ వ్యవస్థను నిధులు,అధికారాలు ఇచ్చి బలోపేతం చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వీరభద్రాచారి గుర్తు చేశారు. బడ్జెట్‌లో కేటాయింపులకే పరిమితమవుతున్న నిధులు ఆ మొత్తంలో వినియోగం జరగడం లేదన్నారు. ఉప ముఖ్య మంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు బి.రాము యాదవ్, మన్నం శ్రీనివాస్, ఎం.వసంతమ్మ పాల్గొన్నారు.